చూడి కడితే.. పెయ్యి దూడే..!

- పాడి పరిశ్రమ వృద్ధికి కేంద్రం సరికొత్త పథకం
- లింగ నిర్ధారిత వీర్య కణాలతో పెయ్యి దూడల సంతానోత్పత్తి..
- పశు వైద్యశాలల్లో సంవృద్ధిగా నిల్వలు
- రెండు డోసులు రూ.500 మాత్రమే
- గర్భధారణ కాకుంటే..డబ్బులు వాపస్..
- పశు పోషకులకు సదవకాశం
- సద్వినియోగం చేసుకోవాలంటున్న పశు వైద్యులు


రాజుపాలెం పశు వైద్యశాల

రాజుపాలెం: పశువులు ఎదకు వచ్చినప్పుడు సహజ, కృత్రిమ గర్భధారణ ద్వారా పెయ్యి, కోడె దూడల జననాలు సమానంగా ఉంటాయని శాస్త్రవేత్తల అంచన. కోడె దూడల వల్ల పాడి రైతుకు నిర్వాహణ భారం అధికమవుతుంది. వాటిని మంద నుంచి వేరు చేసి, వాటి స్థానంలో కొత్తగా పెయ్యి దూడలు, పాడి పశువులు బయటి నుంచి కొనుగోలు చేసేందుకు పాడి రైతులకు కష్టతరమవుతుంది. కనుక లింగనిర్ధారిత వీర్యం పశువులు ఎదకు వచ్చినప్పుడు ఎక్కించడం ద్వారా 90 శాతం పెయ్యి దూడలే జన్మిస్తాయి. ఇందుకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రీయ గోకుల్ మిషన్ సౌజన్యంతో పెయ్యి దూడల ఉత్పత్తి పథకం ప్రవేశ పెట్టింది. పశు పోషకులు వినియోగించుకోవాని పశు వైద్యులు సూచిస్తున్నారు.

పశువుల ఎంపిక ఇలా..

ఎటువంటి గర్భకోశ వ్యాధులు లేని, క్రమం తప్పకుండా ఎదకు వచ్చే గేదెలను రైతులు ఎంపిక చేసుకోవాలి. ప్రధానమైన పశు జాతులు ముర్రా, జెర్సీ, హెచ్ఎఫ్, జెర్సీ హెచ్ఎఫ్, హెచ్ఎఫ్ గిర్, సాహి వాల్‌కి సంబంధించిన వీర్యకణాలు ప్రతి పశువైద్యశాలలో అందుబాటులో ఉన్నాయి.

పశుపోషకులకు సబ్సిడీ

ఒక పశువుకు రెండు డోసుల వీర్యకణాలు కేటాయిస్తారు. సంబంధిత పశు వైద్యాధికారులతో రైతులు ముందుగా ఒప్పందం కుదుర్చుకోవాలి. రెండు డోసుల వీర్య కణాలకు రూ.1,350లు చెల్లించాల్సి ఉండగా అందులో ప్రభుత్వం సబ్సిడీ రూ.850 పోను, ఒక్కో పశువుకు చెల్లించాల్సింది రూ.500లు మాత్రమే.

అమలు విధానం

పశువుకి ఒకసారి డోసు ఇచ్చిన తర్వాత గర్భం దాల్చకపోతే అదే రూ.500కి ఏఐ (కృత్రిమ గర్భధారణ)చేస్తారు. రెండోసారి కూడా ఇలానే జరిగితే రైతుకు రూ.500 తిరిగి చెల్లించాల్సి ఉంటుంది.


లింగనిర్ధారితతో పుట్టిన పెయ్యిదూడ

ఒకసారి మాత్రమే కృత్రిమ గర్భధారణ ప్రక్రియ చేయించి, తర్వాత చేయించని రైతులకు డబ్బులు చెల్లించరు. మొదటి సారి కృత్రిమధారణ జరిగి పశువుకు కోడె దూడ జన్మించినా.. డబ్బులు వాపస్సు ఇస్తారు. ఒక వేళ రెండవ సారి గర్భం దాల్చిన పశువుకు ఇలానే కోడె పుడితే.. రూ.250 మాత్రమే రైతుకు చెల్లించడం జరుగుతుంది. సంప్రదాయ గర్భధారణకు, లింగనిర్ధారిత వీర్యం అందించిన పశువులలో చూడు అయ్యే శాతంలో ఎలాంటి మార్పు ఉండదని వైద్యులు చెబుతున్నారు.

పెయ్యి దూడ జననం



మా గేదెకు రాజుపాలెం పశు వైద్యశాలలో లింగ నిర్ధారిత వీర్యం ఎక్కించడం ద్వారా పెయ్యి దూడ పుట్టింది. పశు పోషకులు లింగనిర్ధారిత వీర్యం తమ పశువులకు ఉపయోగించి, పాడి పరిశ్రమను వృద్ధి చేసుకోవాలి.

– పెద్దింటి రాంబాబు, పశుపోషకుడు, రాజుపాలెం

లింగ నిర్ధారితతో పెయ్యి దూడలు



గేదెలు ఈ సీజన్‌లో ఎక్కువ శాతం ఎదకు వస్తాయి. రైతులందరూ తమ పశువులకు లింగ నిర్ధారిత వీర్యం ఉపయోగించడం వల్ల పెయ్యి దూడలు పుడతాయి. చూడు అయ్యే శాతంలో ఏమాత్రం తేడా ఉండదు. నిల్వలు కూడా సరిపడా ఉన్నాయి. రైతులు ఉపయోగించుకోవాలి.

– డాక్టర్ జి.వీరయ్య, పశువైద్యాధికారి, రాజుపాలెం

క్లుప్తంగా

మట్టి అక్రమ తవ్వకాలు ఆపాలి



రాజుపాలెం: మండలంలోని బ్రాహ్మణపల్లి శివారులో అక్రమంగా మట్టి తవ్వకాలను నిర్వహిస్తున్నారు. రెండు రోజుల నుంచి వందల సంఖ్యలో ట్రాక్టర్లలో మట్టిని సత్తెనపల్లి తదితర ప్రాంతాలకు తరలిస్తూ.. అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. ఈ మట్టి తరలించే ట్రాక్టర్లు రైల్వే బ్రిడ్జి గుండా పోతున్న రైల్వే అధికారులు పట్టించుకోవడం లేదు. మండల స్థాయి అధికారులు కూడా చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి, అక్రమ తవ్వకాలను అరికట్టాలని బ్రాహ్మణపల్లి ప్రజలు కోరుతున్నారు.

రాహు-కేతు పూజలు



నకరికల్లు: మండలంలోని నర్సింగపాడు గ్రామంలో గల శ్రీ అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో రాహు-కేతు పూజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కాశీ విశ్వేశ్వరుని ఆలయంలోని రాహు-కేతువులను పూజిస్తే సర్వదోషాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం. దీంతో సమీప గ్రామాలతో సుదూర ప్రాంతాల నుంచి భక్తుల అధిక సంఖ్యలో తరలివచ్చారు. కుటుంబ సమేతంగా సామూహిక పూజల్లో పాల్గొన్నారు. అర్చకులు కొమ్మువరపు పవన్ కుమార్‌శర్మ ఆధ్వర్యంలో రాహు-కేతువును విశేషంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు చేశారు.

పచ్చ పైత్యం



అమరావతి: ప్రసిద్ధ శైవక్షేత్రం, పర్యాటక కేంద్రమైన అమరావతిలో ప్రజల సౌకర్యార్థం సుమారు 20 ఏళ్ల క్రితం మెయిన్ రోడ్డు మధ్యలో గాంధీ బొమ్మ సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు డివైడర్ ఏర్పాటు చేశారు. దానికి ప్రస్తుతం పసుపు రంగు వేయడం పలు విమర్శలకు తావిస్తోంది. గతంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికి ఆర్ అండ్‌బీ రహదారి కావటంతో జీబ్రా లైన్‌లకు వేసే నలుపు, తెలుపు రంగులను వాడేవారు. ప్రస్తుతం పసుపు రంగు వేయడంపై గ్రామస్తులు ఇలాంటి చర్యలు మంచివి కాదని చర్చించుకుంటున్నారు.

గోశాల సందర్శన

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోశాలను రాష్ట్ర గోశాల ఫెడరేషన్ అధ్యక్షుడు మునగాల నాగవెంకటమురళీకృష్ణ ఆదివారం సందర్శించారు. దేశీయ ఆవులతో గోశాల నిర్వహించటం అభినందనీయమని నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. గోశాల నిర్వహణకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను వివరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మురళీకృష్ణను దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో చలివేంద్రం సంఘం అధ్యక్షుడు బచ్చు కొండలు, గోశాల అధ్యక్షుడు కాకరపర్తి సుబ్రహ్మణ్యం, పోతుగంటి రామకోటేశ్వరరావు, దివ్వెల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చర్చికి రూ.50 వేల వితరణ



క్రోసూరు: సెమీ క్రిస్మస్ సందర్భంగా వట్టి చెరుకూరు ఎంపీపీ చిలక సుబ్బారావు ఆదివారం వేల్పూరు లూథరన్ చర్చికి రూ.50వేలు విరాళమిచ్చారు. చర్చి ఫాదర్, సంఘపెద్దలు, చిలక ఇంటి పేరుగల పెద్దలతో కలిసి చర్చి నిర్మాణానికి నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో చిలక సుందరరావు, రాంబాబు, లక్ష్మయ్య, రామయ్య, జాన్సన్ సుధాకర్, నాగరాజు, మరియదాసు, ప్రకాశం, యోహాను, నాగేశ్వరరావు పాల్గొన్నారు. క్రైస్తవులకు ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. హాజరైన అతిథులందరికీ చర్చి ఫాదర్ జ్ఞాపికలు అందజేశారు.

ఘనంగా దత్తాత్రేయ జయంతి

యడ్లపాడు: మండలంలోని కొత్త సొలస గ్రామంలోని శ్రీషిర్డీసాయి మందిరం భక్తులతో కళకళలాడింది. దత్తాత్రేయ జయంతిని పురస్కరించుకుని ఆదివారం ఆలయంలోని దత్తాత్రేయస్వామి వారికి అర్చకుడు నారాయణం లక్ష్మణాచార్యులు విశేష అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అష్టోత్తర శతనామావళి కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేటి నుంచి శిక్షణ తరగతులు

రాజుపాలెం: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం నుంచి ఈ నెల 19వ తేదీ వరకు రెండు విడతలుగా సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం శిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జీవీ సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమ, మంగళవారాల్లో మొదటి బ్యాచ్‌కి, 18, 19 తేదీల్లో రెండో బ్యాచ్‌కు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ శిక్షణకు ప్రతి ఒక్కరూ హాజరు కావాలని కోరారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

క్రోసూరు: మండల కేంద్రంలోని అమరావతి బస్టాండ్ సెంటర్ వద్ద మసీదు కాంప్లెక్స్ ఆవరణలో సోమవారం శంకర కంటి ఆసుపత్రి వైద్యులు ఉచిత కంటి వైద్యశిబిరం జరుగుతుందని ఎంపీడీవో జి.శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి వైద్య శిబిరం జరుగుతుందని, ప్రజలు ఆధార్ కార్డు తీసుకొని రావాలని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని తెలిపారు.

వేతన కార్యదర్శుల సమావేశం

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): ఏపీ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం వేతన కార్యదర్శులు, వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం రెంటపాళ్ల గ్రామంలోని పాల శీతలీకరణ కేంద్రంలో ఆదివారం జరిగింది. సమావేశంలో రెంటపాళ్ల పాల శీతలీకరణ కేంద్రం మేనేజర్ తాడిబోయిన గోపీ, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు కంబాల శ్రీనివాస్, పెద్దపాలెం కార్యదర్శి నరసింహరావు, రెంటపాళ్ల కార్యదర్శి వెంకటేశ్వర్లు, డెయిరీ సూపర్‌వైజర్లు, వర్కర్స్ పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి


సత్తెనపల్లి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నేతల నివాళి


హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ నాయకులు చల్లంచర్ల సాంబశివరావు, అచ్యుత శివప్రసాద్, సింగర్ మధు, నక్కా శ్రీనివాసరావు, లోకా మాధవ్, ఉల్లంగుల ప్రసాదుబాబు, వల్లెం నరసింహరావు, శిరిగిరి వెంకట్రావు, తుమ్మల వెంకటేశ్వర్లు, గోరా తదితరులు పాల్గొన్నారు.

■ పట్టణంలోని సాయికృష్ణ థియేటర్ ఎదురుగా ఉన్న టీచర్ మస్తాన్ ఐటీఐ కాలేజ్‌లో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి నిర్వహించారు. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు పాల్గొని ఆంధ్ర రాష్ట్ర అవతరణకు ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములన్నారు. భారతదేశంలో అనేక సంస్థానాలను విలీనం చేసిన మహనీయులు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పొట్టి శ్రీరాములు, వల్లభాయ్ పటేల్ చిత్రపటాలకు పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీచర్ మస్తాన్ ఐటీఐ కాలేజ్ ప్రిన్సిపల్ రమేష్, కో-ఆర్డినేటర్ షేక్ రిహాన, మాధురి పాల్గొన్నారు.

■ పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన రహదారి వెంబడి, గాంధీ చౌక్ వద్ద గల పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అన్నం బాలసుబ్రహ్మణ్యం, యువజన సంఘం అధ్యక్షుడు చిల్లంచర్ల కల్యాణ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఆతుకూరి నాగేశ్వరరావు, ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం అధ్యక్షుడు బచ్చు వెంకటేశ్వర్లు, న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు, పెండ్యాల కాశీమల్లేశ్వరరావు, దేవతి సుబ్బారావు, ఎమ్.వి.నరసింహారావు, కొత్త శ్రీనివాసరావు, బచ్చు శ్రీనివాసరావు, మద్ది అమర్, దేవరపల్లి కాశి, వనమా రాజేష్, కటకం బాబు, ఆత్మకూరి హరనాథ్, కొత్తూరి విశ్వేశ్వరరావు, బచ్చు రామసుబ్బారావు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..

ముప్పాళ్ళ: మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాద్, ఎంపీడీవో పీ.జే.విలియమ్స్ పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు అనుమాలశెట్టి శ్రీనివాసరావు, పోతుగంటి నరసింహారావు, ఏపీఎస్ రంగ నాయకులు, పొట్టి రామకృష్ణ పాల్గొన్నారు.

అమరావతి: అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఎంపీపీ మేకల హనుమంతరావు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక జన చైతన్య సమితి నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ టీచర్ శివపార్వతి, కృష్ణవేణి పాల్గొన్నారు.


ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో..


ముప్పాళ్లలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘ సభ్యుల నివాళి


పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళి

ప్రసన్నాంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి కృషి

పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్


కల్యాణ మండపానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

బెల్లంకొండ: తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ ప్రసిద్ధమైన శ్రీ కోళ్లూరు ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలిపారు. ఆదివారం ఉదయం మండలంలోని బెల్లంకొండ క్రాస్ రోడ్డు వద్ద గల ఆలయం ప్రాంగణంలో కల్యాణ మండపం నిర్మాణానికి భూమిపూజ చేశారు. గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు భూమి పూజలో పాల్గొని, అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. దాదాపుగా రూ.2 కోట్ల వ్యయంతో దాతల సహకారంతో కల్యాణ మండపాన్ని నిర్మించనున్నట్లు దేవదాయ శాఖ అధికారులు తెలిపారు. పులిచింతల ప్రాజెక్టు ముంపు గ్రామం గోపాలపురానికి చెందిన గర్నేని హనుమంతరావు కల్యాణ మండపం నిర్మాణానికి సమకూర్చుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలలో ప్రసిద్ధ ఆలయాలకు ధీటుగా ప్రసన్నాంజనేయ స్వామి ఆలయాన్ని నిర్మిస్తామని పేర్కొన్నారు. ఇందుకు ఇదే ప్రాంతానికి చెందిన ఢిల్లీలో పనిచేస్తున్న ఐపీఎస్ అధికారి ముందుకు రావడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం సహకారంతో పాటుగా దాతలు, భక్తులు సహకారంతో ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవదాయ కార్యనిర్వహణాధికారి వెంకటేశ్వరరెడ్డి, గుంటూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వెన్నా సాంబశివారెడ్డి, టీడీపీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి పీయస్కే మస్తాన్ షరీఫ్, సర్పంచ్ ఆసుల జగన్, సముద్రం, అక్కల వెంకట్రామిరెడ్డి, నూన్సావతు హనుమంతరావు నాయక్, వెన్నా శీతారామిరెడ్డి, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న హెల్ప్ హాస్పిటల్ వైద్యులు

అచ్చంపేట: మండలంలోని మాదిపాడు జెడ్పీ హైస్కూలు ఆవరణలో విజయవాడ హెల్ప్ హాస్పిటల్ సౌజన్యంతో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. మాదిపాడు, గింజుపల్లి, గింజుపల్లి తండా, కుంటిమద్ది, జడపల్లిమోటు తండా, కంచుబోడుతండా తదితర ప్రాంతాల నుంచి రోగులు భారీ సంఖ్యలో తరలి వచ్చి, వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ముఖ్యంగా చాతి, గుండె నొప్పి, గ్యాస్ సమస్యలతో బాధపడేవారికి ఉచితంగా బీపీ, ఈసీజీ, ఎకో టెస్టులు నిర్వహించారు. యాంజియోగ్రామ్, స్టంట్స్, శస్త్ర చికిత్సలు అవసరమైనవారిని గుర్తించి విజయవాడ హెల్ప్ హాస్పిటల్‌కు రిఫర్ చేశారు. సుమారు 150 మందికి వైద్య సేవలు అందించి బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాదా ఈశ్వరమ్మ, మాదా వెంకట్రావు, మాజీ సర్పంచ్ కొరివి వెంకట్రామయ్య, ఎంపీటీసీ రమేష్ సీతాభాయ్, మాజీ ఎంపీటీసీ తుమాటి సత్తయ్య, ఆర్యవైశ్య సంఘ నాయకులు దేవరశెట్టి శ్రీనివాసరావు, ఆర్ఎంపీ వైద్యులు షేక్ కరిముల్లా, దావేదు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన


విద్యుత్ బిల్లులు దహనం చేస్తున్న సీపీఎం నాయకులు మహేష్, గ్రామస్తులు

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): విద్యుత్ చార్జీలు పెంచబోమని ఎన్నికల్లో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి పెండ్యాల మహేష్ అన్నారు. సత్తెనపల్లి మండలంలోని రెంటపాళ్ల గ్రామంలో విద్యుత్ చార్జీల పెంపుపై ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రజలపై కూటమి ప్రభుత్వం రూ.8,114 కోట్ల ట్రూ అప్ చార్జీల భారం మోపేందుకు సిద్ధమైందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్యుత్‌పై శ్వేతపత్రం ప్రకటించాలన్నారు. గతంలో వాడుకున్న కరెంటుకు ఇప్పుడు అదనంగా బిల్లులు కట్టేలా సర్దుబాటు చార్జీల పేరుతో వసూలు చేపట్టడం దుర్మార్గమన్నారు. ఇదే కాకుండా మరో రూ.20 వేల కోట్లు ప్రజలపై భారం మోపేందుకు ప్రభుత్వం సిద్ధమవుతుందన్నారు. వెంటనే విద్యుత్ చార్జీల పేరుతో ప్రజలపై భారాన్ని మోపేలా తీసుకున్న చర్యలను ఉపసంహరించుకోవాలని కోరారు. చార్జీలు తగ్గించే వరకు ఉద్యమిస్తామన్నారు. ఈ సందర్భంగా రెంటపాళ్లలోని రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. అనంతరం విద్యుత్ బిల్లులను తగలబెట్టారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు దుగ్గి మేరమ్మ, జె.భగత్, బి.రామారావు, పార్టీ నాయకులు దుగ్గి నాగేశ్వరరావు, అనూష, సుజాత, లక్ష్మణరావు, నాగార్జున, గణేష్ పాల్గొన్నారు.

వేంకటేశ్వరుడికి పుష్పయాగం



చిలకలూరిపేట: మండలంలోని చినపసుమర్రులో ఉన్న అయ్యప్పస్వామి దేవస్థానం ప్రాంగణంలోని వేంకటేశ్వరస్వామికి ధనుర్మాసం మార్గశిర పౌర్ణమిని పురస్కరించుకొని ఆదివారం పుష్పయాగం నిర్వహించారు. ఆలయ అర్చకులు పావులూరి లక్ష్మణ, వింజనంపాటి సాయి కృష్ణశర్మ, పరుచూరి శేషాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు వెలంపల్లి రవిశంకర్, మేనేజర్ జగన్‌మోహనరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఓవరైంది..చూడండి


అచ్చంపేట ప్రధాన వీధిలో పట్ట కప్పకుండా వెళ్తున్న ఇసుక ట్రాక్టర్

అచ్చంపేట: ఓవర్ లోడుతో వెళ్తున్న ఇసుక ట్రాక్టర్లతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం పట్టలు కూడా కప్పకపోవడంతో.. ఇసుక రేణువులు గాలికి ఎగిరి ట్రాక్టర్ వెనుక వచ్చే ద్విచక్ర వాహనదారుల కళ్లల్లో పడుతున్నాయి. దీంతో వారు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. అధిక లోడు ఇసుకతో ప్రధాన రహదారిలో వేగంగా ట్రాక్టర్లు వెళ్తున్నాయి. ట్రక్కు ఇసుకపై కనీసం పట్టాలు కప్పించాలన్న ఆలోచన కూడా అధికారులు చేయకపోవడం దురదృష్టకరం. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

యోగా సాధనతో మనస్సు ప్రశాంతం


అభ్యాసకులకు జ్ఞాపికలు అందజేస్తున్న యోగాచార్యుడు శ్రీనివాసరావు

నరసరావుపేట ఈస్ట్: ఉత్తమ జీవనానికి యోగా సాధనమని మంగళగిరి శ్రీవేంకటేశ్వర యోగ సేవా కేంద్రం ప్రధానాచార్యులు డాక్టర్ వేంకటేశ్వర యోగి గురూజీ తెలిపారు. యోగ సేవాకేంద్రం నరసరావుపేట శాఖ ఆధ్వర్యంలో 28 రోజుల పాటు నిర్వహించిన 181వ ఉచిత యోగ శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా ఆదివారం ప్రకాష్‌నగర్‌లోని మాగులూరి బిల్డింగ్ అక్షర పాఠశాల ఆవరణలో ఆనందోత్సవం నిర్వహించారు. శిబిరంలో పాల్గొన్న అభ్యాసకులనుద్దేశించి డాక్టర్ వేంకటేశ్వర గురూజీ మాట్లాడుతూ, ఓంకారంతో మొదలయ్యే యోగ సాధనతో మనస్సు ప్రశాంతంగా ఉంటుందని వివరించారు. అసూయ రాగద్వేషాలకు అతీతంగా పాపకర్మలను విడనాడి సత్కర్మలను చేయటం అలవడుతుందని వివరించారు. అభ్యాసకులు ప్రతిరోజు శిబిరంలో తాము నేర్చుకున్న ఆసనాలు, ధ్యానం, ప్రాణాయామంను ఆచరించాలని తెలిపారు. శిబిరానికి పూర్తిస్థాయిలో హాజరైన వారికి బోధక యోగాచార్యుడు జల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అతిథులు జ్ఞాపికలు అందించారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మేనేజర్ కృష్ణప్రసాదు, స్వామి స్కూల్ డైరెక్టర్ ఈ.ఎం.స్వామి, మాగులూరి రమణారెడ్డి, వెంగళరెడ్డి, కాపుగంటి శివప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్స్ డే జయప్రదం చేయండి

వినుకొండ(నూజెండ్ల): స్థానిక నరసరావుపేట రోడ్డులోని ప్రభుత్వ పెన్షనర్ల సంఘం భవనంలో ఈ నెల 17న పెన్షనర్స్ డే, 17వ వార్షిక సమావేశం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.కృష్ణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా పెన్షనర్స్ డే కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమానికి ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జి.కృష్ణమూర్తి, సుబ్రహ్మణ్యం, వీరరాఘవయ్య, సుబ్బయ్యశర్మ, నాగేంద్రుడు పాల్గొన్నారు.

దాసునాయన మఠంలో పౌర్ణమి వేడుకలు

నాదెండ్ల: గణపవరం సినిమా హాలు సెంటర్‌లోని ఆంజనేయ ఉపాసకులు అచల దాసునాయన మఠంలో ఆదివారం పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఆధ్యాత్మిక గురువులు ప్రసంగం చేశారు. అనంతరం ఆయా గురువులను మఠాధిపతి కటారు దాసునాయన శాలువాలతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి పౌర్ణమి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం అన్నదానం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

జూదరుల అరెస్టు

యడ్లపాడు: పేకాట స్థావరంపై పోలీసులు ఆకస్మిక దాడి నిర్వహించారు. ఎస్ఐ వి.బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కొండవీడు గ్రామంలో కోతముక్కల ఆట కొనసాగుతుందని పోలీసులకు అందిన సమాచారంతో దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి రూ.9,880 నగదును స్వాధీనం చేసుకున్నారు.